# అపశృతి

నూరేళ్ళ పంటకు పెళ్ళి అంకురార్పణం గదా! వేద మంత్రాలు రెండు మనసుల నొకటి చేస్తే- మళ్ళీ పెళ్ళి రోజు నాటికి ముగ్గురవడం పెళ్ళి జంటకు అనూహ్యమైన అనుభూతి. లేత మామిడికాయ ముక్కలను ఉప్పూ కారమూ, పచ్చి కొబ్బరి ముక్కలకు పంచదార నంజుకు తినే రుచి గూడా ఆ దివ్యానుభూతికి సరిరాదు.

ఈ ఉపోద్ఘాతమంతా నాగభూషణం అనుభవం లోనిదే. రోహిణి కార్తిలో రోకలి బండలంత వర్షం కురిసినట్టూ, నలభయ్యేళ్ళ వయసులోనే తాతై కూచున్నాడు. ఆ విషయం తలచుకుంటే తాను హీరోగా నటించిన మొదటి సిన్మాను మొదటిసారి చూస్తున్నంత పొంగిపోతాడు. కాస్సేపు మరో లోకాల్లోకి షికారు కెళ్లొస్తాడు.

"మన గుండెల మీద పెరిగిన చిట్టి తల్లి మరో చిట్టి తల్లికి తల్లయి పోయిందడీ!" అంటూ – లక్షల ఖర్చుతో సినిమా తీసి విడుదలైన మొదటి వారంలోనే కోట్లు సంపాదించిన నిర్మాతలా సంబరాల కెరటాల్లో తేలిపోయింది భార్య పార్వతి. పార్వతి తమాషా చూపులకు కుడిచెయ్యి ఎడమ్మీస మ్మీది కెళ్ళిపోయిండి. పెంచని మీసాన్ని వంచలేక తంటాలు పడుతూంటే - పార్వతి గుండెల్లోంచి పాల పొంగులా తోసుకొచ్చిన నవ్వు పెదాలు దాటి రానంది.

పార్వతినీ, ఆవిడ కూతుళ్లనూ వరుసగా నిలబెడితే – వాళ్ళంతా అక్కా చెల్లెళ్ళనుకుంటారే తప్ప తల్లీ కూతుళ్ళనుకోరు.

ఆ మాట ఎవరన్నా పార్వతితో అంటే - ఆవిడ మొహం ముద్ద బంతి పూవులా విచ్చుకుంటుంది. నుదుటి సిందూరం మరింత కాంతివంతమై పోతుంది. కాని అదే విషయం నాగభూషణం బుర్రను తొలిచేస్తుంటే ఆరు కిలోల ఆముదం దాగిన అర్భకుడిలాగై పోతాడు. తప్పనిసరిగా తప్పు చేస్తున్నవాడిలా తల దించుకుంటాడు. ఐతే .... ఐదు నిమిషాల్లో అదంతా దిగమింగి పరమ శివుడిలా తలెత్తుకు తిరుగుతాడు గూడాను.

వరుసగా సుశీల, సుకుమారి, సుభాషిణి, సుహాసిని, సుకేశిని, సుమాంజలిలు పుట్టుకొచ్చారు, కాని తల కొరివి పెట్టేందుకు తనయుడు కావా లన్న అరాటం రోజు రోజుకు పదునెక్కిందా దంపతుల్లో.

ఏపాటు తప్పినా సాపాటు తప్పనట్టే - సంసార సాగరంలో మునకలు వేయక తప్పదుగదా! మరి కాల గమనం గూడా ఆగదాయె.

మూడో కాన్పుకు ముందు పార్వతిని పరీక్ష చేసిన లేడీ డాక్టరు కలుపుగోలుగా మాట్లాడి

"పనిలో పని మీయావిడకు ట్యూబెక్టమీ చేయించం"డని ఉచిత సలహా ఇచ్చింది. అప్పుడు తప్పకుండా కొడుకే పుడతాడన్న విశ్వాసం తలాడించిండ. ఆ తర్వాతే కథ అడ్డం తిరిగింది - కూతురు పుట్టిందని.

నాల్గోసారి పురుడు పోసిన అదే డాక్టరు

"పార్వతికి మరోసారి కాన్పువస్తే కష్టమై పోతుంది నాగభూషణం గారూ!" హెచ్చరించింది. డాక్టర్ కలువ కళ్ళలో ఎర్రదనం పులుముకుం దప్పటికే.

తన కిష్టంలేని పనిని తప్పని సరిగా చెయ్యాలని పై అధికారి నుండి ఆదేశం అందుకున్న చిరుద్యోగిలా సతమతమై పోతున్న భర్త మానసిక సంఘర్షణ నట్టే పసిగట్టిన పార్వతి తట్టుకోలేక పోయింది.

"డాక్టర్ల కేమండీ, అలాగే సలహాలిస్తారు. మీరేం బాధ పడొద్దు. కనీసం ఒక్క మగ నలుసైనా లేకపోతే ఎలా?" ధైర్యమిచ్చి - కరణేషు మంత్రి అయింది.

కరణేషు మంత్రికి కై మోడ్పులందాయి. చాకుల్లాంటి చిలిపి చూపులు అనుమానం తాళ్ళను కోసిపారేశాయి. కాలం ఒడిలో సరికొత్త రూపు దిద్దు కున్న పార్వతి అందం మరో ఆలోచన కాస్కార మివ్వలేదు.

ఐదోసారి నెలదప్పగానే బలవర్థక ఔషధాల వాడకం ప్రారంభమైంది. వాటి పుణ్యమాని కాన్పు మామూలుగానే జరిగింది.

ప్రతి కాన్పుకు నెల రోజులు ముందొచ్చి అన్నీ చూసుకుంటున్న పార్వతి తల్లి కన్నుమూసిందప్పుడే.

ఆరో కాన్పుకు పెద్ద కూతురు సుశీల – తల్లి స్థానాన్నాక్రమించింది. ఆరోదిగూడా ఆడపిల్లయినందుకు పార్వతి గుండె చెరువై పోయింది. కళ్ళు కాలువలై పోయినై. అంతా కనిపెట్టిన సుశీల

"నువ్వలా బాధపడితే ఎలాగే అమ్మా! మన చేతుల్లో ఏముంది చెప్పు?" కంటతడి బెట్టింది.

రెండేళ్ళ క్రితం పెళ్లయిన ఆ సుశీలే ఇప్పుడు తల్లయి పోయింది. ఆర్నెల్ల క్రితం అత్తవారింట్లో అడుగు పెట్టిన రెండో కూతురు సుకుమారి – అత్తా మామలూ, భర్తతో సహా దిగిపోయింది– సుశీల కూతురు నామకరణోత్సవానికి. రాగానే – తల్లయి పోయిన అక్కను తనివిదీరా చూసుకుంది. పాప బుగ్గలు పుణికి పులకించిపోయింది.

బంధు మిత్రులతో ఇల్లంతా కళ కళ లాడ్తుంది. అంగట్లో గొంగళ్ళ దుకాణం యజమానిలా – నాగభూషణం హడావుడి అంతా ఇంతా గాదు.

విందు భోజనంలో గులాబ్‌జామూన్ చప్పరిస్తూ, నాగభూషణం కేసి చూస్తూ.

"మీ ఇద్దరు అల్లుళ్లూ మీకు తమ్ముళ్ళలాగుంటారండీ!" అన్నాడు కోవర్కర్ కుటుంబరావు – చప్పిడి ముక్కును సాధ్యమైనంత వెడల్పు చేసి.

"ఔను.... పెద్దల్లుడు రామం, చిన్నల్లుడు రాఘవ నాకు తమ్ములు లేని లోటు తీర్చారండీ!" అనేసి – మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నంత సంతోష పడియాపోడు నాగభూషణం.

ఓవైపు మరదళ్లు బావలను ఆట పట్టిస్తున్నారు. మరోవైపు పార్వతి మనవరాలుకు తలంటి కొత్త గుడ్డలు తొడుగుతూంది. లోకం పోకడంతా అప్పుడే తెలిసిపోయినట్టు–బోసి నవ్వులు చిందిస్తుందా చిన్నారి పాప.

ఆకుల మధ్య పూవులా–పట్టు బట్టల్లో మెరిసిపోతున్న సుశీల పేరంటానికొచ్చిన ముత్తయిదువులకు వాయినాలందిస్తుంది. రామం కళ్లల్లో సుశీల – కడిగిన ముత్యంలా, కొత్తగా అవతార మెత్తిన దేవకన్యలా దోబూచులాడుతుంది,

"నీ కూతురు కన్నీ నీ పోలికలే వచ్చాయి బావగారూ! అదృష్ట వంతు రాలు" అంది సుకుమారి రామంతో.

"ఓ సంవత్సరం లోగా నీ ఒడిలోగూడా అలాంటి అదృష్టవంతురాలే కన్పిస్తుంది మరదలు గారూ!" నవ్వేశాడు రామం.

సుకుమారి చెంపలు పూసిన కెంపులను చూపులతో ఏరుకుంటున్నాడు రాఘవ. విరబూసిన మందారాన్ని అరమోడ్పు కన్నులతో ఆక్రమిస్తున్న తేనెటీగల్లా కదుల్తున్న ఆవిడ కళ్ళు - రాఘవను ఆపాదమస్తకం తడిమి పెదాల మీద వెన్నెల జల్లులు కురిపించాయి.

అప్పుడప్పుడు ఎదురు తిరిగే నాగభూషణం అంతరంగాన్ని కప్పుడే సమయం దొరికింది.

" భార్య కాన్పులవల్ల కూడబెట్టిందేమీ లేదాయె. ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్లతో అప్పుల కుప్పలు పెరిగిపోయె. మరి మిగతా కూతుళ్ళ సంగతేమిటీ?" పాతప్పులవాడు కొత్తగా నిలదీసినట్టు అడిగేసింది.

"ఊరంతా ఒకదారైతే ఉలిపిరి కట్టది మరోదారన్నట్టు- పండగనాడు గూడా పాతగోలేనా?" సెత్తిమీద మొట్టికాయుంటించుకొని తన పనిలో నిమగ్నమైపోయాడు. లేకపోతే పదిమందిలో పలుచనై పోవాల్సివస్తుంది మరి.

ముద్దొస్తున్న మనవరాలిని రబ్బరు బొమ్మలా తయారు చేసి వియ్యపురాలి కందించ బోయింది పార్వతి.

"కడుపునిండా కనుకుంటున్నావు. పాపను నీ చేతుల్తోనే ఉయ్యాలలో వేయి వదినా!?" మనవరాలి బుగ్గల మీద ముద్దులు వడ్డించి అభ్యర్థించింది వియ్యపురాలు.

"పెద్ద వియ్యపురాలుకు నేనంటే ఎంతో గౌరవం!" పార్వతి పొంగిపోయి పాపను ముద్దాడింది. ఆ తర్వాత మెల్లిగా ఉయ్యాలలో వేయబోయింది. కళ్లు విష్ణుచక్రాల్లా తిరుగుతున్నాయి. భూమి తలకిందులై పోతుంది. అకస్మాత్తుగా నరాల్లో రక్తానికి బదులు నీరు ప్రవహిస్తున్నట్టనిపించింది. కడుపులో నొప్పి.... విపరీతమైన నొప్పి... భరించరాని నొప్పి.

" అమ్మా!" కేకతో కుప్పకూలి పోయింది. కేక రాకాసి లోయలోంచి వచ్చినట్టుంది.

కొంపదీసి అల్లుళ్లూ, వియ్యపురాళ్ళ ముందు అభాసుపాలై పోనుగదా.... బేజారెక్కువైంది.

"ఏమైంది వదినా?" గాబరాగా పొపనందుకుంది వియ్యపురాలు.

"హమ్మా...అయ్యా...భగవాన్....మెలికలు తిరిగి పోతుంది పార్వతి. ఆడవాళ్ల అనుమానం చెవులు కొరికింది. అందరి చెవులూ కొరికాక అవి పురిటి నొప్పులని తేలిపోయింది.

" మగాళ్ళంతా బయట కెళ్లండి! " హుకుం జారీచేసిందో ముసలి ముత్తయిదువ.

" హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి గదా! " అంటూ రిక్షా కొరకు పరుగెత్తాడు రాఘవ.

తొంబైతొమ్మిది ఖూనీలు చేసి తప్పించుకొని వందవ ఖూనీ కేసులో రెడ్‌హాండెడ్‌గా పట్టుబడిన దోషిలాగై పోతున్నాడు నాగభూషణం. నోటమ్మట మాట రావడంలేదు. వెన్ను పూసలో వణుకు గూడాను.

ఆరు కాన్పుల అనుభవమున్న పార్వతికీసారి నొప్పులు వింతగా, మరింత బాధగా తోసుకొస్తున్నాయి. గుండెల్ని వణికిస్తున్నాయి. కడుపులోని నరాలు కరిలేని దారం పోగుల్లా పట పట తెగిపోతున్నాయి. పేగులు కదలమంటున్నాయి. వీపుమీద గొడ్డళ్ళతో పొడిచినంత బాధ. అరుద్దామంటే గొంతు పెగలడంలేదు. అంతా అయోమయం.

" తాతై పోయిన నాగభూషణం మరోసారి తండ్రి కాబోతున్నాడన్న మాట. కంగ్రాట్స్ భూషణం! " వెళ్లిపోతున్న మిత్రులు అభినందనలతో వెక్కిరిస్తున్నారు. ఎర్రగా కాల్చిన గడ్డపారతో నడుంచుట్టూ వాతలు పెడుతున్నట్టనిపిస్తుంది - నాగభూషణంకు.

"అమ్మా, అమ్మా... ఏమైందమ్మా" లోపల ఆందోళనగా అరుస్తుంది సుశీల.

" మాట్లాడమ్మా... అమ్మా ఇటు చూడమ్మా! " సుకుమారి గొంతులో తుఫాను చెలరేగింది.

" రిక్షా తెచ్చానండీ!" చెమటలు కక్కుతూ పరుగెత్తుకొచ్చాడు రాఘవ.

పసిపాప నెత్తుకొని బయటకొచ్చిన రామం తల్లి

"ఇంకా రిక్షా ఎందుకు నాయనా! పాడె కట్టించండి" గొల్లుమంది.

నాగభూషణం తలలో భూమ్యాకాశాలు బద్దలై పోతున్నాయి. *

(ఆకాశవాణి హైదాబాద్ "ఏ" కేంద్రము 3-5-1993)